



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 101 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శుక్రవారం 24 ఏప్రిల్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-



## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి



**హైదరాబాద్,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల

మిగతా 2వ పేజీలో..



## తమిళనాడులో ముగిసిన పోలింగ్

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

**ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు**

**ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి**

**చెన్నై,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్ముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు

మిగతా 2వ పేజీలో..





## అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

**సమ్మెను విచ్ఛిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు**



**జనగామ,ఏప్రిల్ 23 (చట్టం) న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు

మిగతా 2వ పేజీలో..

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ




**కోల్‌కతా,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు

మిగతా 2వ పేజీలో..

## మూడోరోజు సింగపూర్‌లో మంత్రుల పర్యటన

### ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శించిన బృందం



**అమరావతి,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్‌లో మూడో రోజు గురువారం పర్యటిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శించింది. పోర్టు నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను ఏ విధంగా వినియోగిస్తున్నారో మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగపూర్‌లోని ఖాం ఆధ్వర్యంలో నడుస్తున్న టువాస్ పోర్ట్.. 2040 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమేటెడ్ టెర్మినల్‌గా రికార్డు సృష్టించబోతోంది. ఈ పోర్టులో అమలవుతున్న వినూత్న పద్ధతులను మంత్రుల బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. పోర్టులో కంటైనర్లను ఒక చోటు నుంచి మరొక చోటికి తరలించడానికి ఉపయోగిస్తున్న డ్రైవర్ లేని ఎలక్ట్రిక్ వాహనాల పనితీరును చూసి మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారీ క్రేన్లను ఆపరేటర్లు నేరుగా కాకుండా.. రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రించే విధానాన్ని పరిశీలించారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ వ్యవస్థల ద్వారా కార్యకలాపాలను ఎలా వేగవంతం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ అధ్యయన పర్యటనలో రాష్ట్ర మంత్రులు నారాయణ, బి.సి. జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

**మంత్రి సవిత సంచలన వ్యాఖ్యలు**



**అమరావతి,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** సమాజం కోసం మంచి చేసే నాయకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ తెలుగుదేశం అయితే హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ అంటూ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. హత్యలు

మిగతా 2వ పేజీలో..

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

- హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్ళైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి

మిగతా 2వ పేజీలో..

# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

- మరో రంగారెడ్డి కానున్న అనకాపల్లి
- పరిశ్రమల రాకతో మెండుగా ఉద్యోగావకాశాలు
- ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు
- రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

**అనకాపల్లి,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** విశాఖకు ఎక్కువ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పర్యటించిన సీఎం.. రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని.. అన్ని బస్సులను ఏసీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లా చేస్తామని అన్నారు. ఈ జిల్లాను అదృష్టం వరించిందని.. భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అనకాపల్లి నంబర్‌వన్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారింది. ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయి. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయి. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత నాది. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఘాట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ స్టీల్ కంపెనీ వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని.. ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదని సీఎం అన్నారు. ఉద్యోగాల కోసం ఏపీకి రావాల్సిన పరిస్థితి తీసుకొస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు తీసుకొస్తామన్నారు. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2019-24 మధ్య ఏపీలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని వైసీపీ కుప్పకూల్చిందని మండిపడ్డారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఉచితంగా కరెంట్ వచ్చే సోలార్‌ను వినియోగించుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.12 వేల కోట్ల భారం మోపారన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలు వెనక్కిపోయాయని సీఎం అన్నారు. సొంత బాబాయ్‌నే చంపిన




చిల్లర పార్టీ వైసీపీ అంటూ మండిపడ్డారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని చెప్పారని.. పోస్టుమార్టం

మిగతా 2వ పేజీలో..

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు

**వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం**

**లక్నో,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

**ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్**

**భారీగా పోలింగ్ శాతం నమోదు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్23 (చట్టం) న్యూస్ :** దేశంలో కీలక రాష్ట్రాలైన తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ తొలి విడత ఎన్నికల్లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్

మిగతా 2వ పేజీలో..

## ఇంధన భద్రతపై భారత్ దృష్టి

**గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు**




**న్యూఢిల్లీ,ఏప్రిల్23(చట్టం) న్యూస్ :** ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం

మిగతా 2వ పేజీలో..

# తమిళనాడులో ముగిసిన పోలింగ్

మొదటి పేజి తరువాయి..





హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది.

శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

మొదటి పేజి తరువాయి..

తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

మొదటి పేజి తరువాయి..

అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

మొదటి పేజి తరువాయి..

ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటు ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన తమ డిమాండ్ల కోసం రోడ్డెకిన తమను అడ్డుకోవద్దంటూ పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్స్ నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

మొదటి పేజి తరువాయి..

చేయటం, సాక్షుల్ని బెదిరించటం, రేటు మాట్లాడటం, కుటుంబసభ్యులను, జడ్జిలను కూడా బెదిరించాలని చూడటం జగన్‌కు అలవాటు అంటూ మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తరహాలోనే వైసీపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తండ్రి శవం పెట్టుకుని రాజకీయం చేయటం, బాబాయ్ గొడ్డలి పోటు ఘటనలను ఇప్పటికే చూశామని మంత్రి తెలిపారు. చంపటం, రౌడీలను, గూండాలను తయారు చేయటమే వైసీపీ పనిగా పెట్టుకుందన్నారు మంత్రి. అనంత బాబును జగన్ నెత్తిన పెట్టుకోవటంతోనే దళితుడైన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సైకో తనానికి పరాకాష్టగా అనంత బాబు వ్యవహారం ఉందన్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. గతంలో ఏమరపాటు ఉండి ఉండొచ్చేమో కానీ ఇప్పుడు ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జగన్ వల్ల బలయ్యేవారిలో బీసీలు, దళితులే ఎక్కువ మంది ఉన్నారని మంత్రి సవిత పేర్కొన్నారు.

# రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

మొదటి పేజి తరువాయి..

నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పుర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ప్రజలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం, తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. మొత్తం 294 స్థానాలు ఉండగా తొలి విడతలో 152 సీట్లకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోని ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4 సోమవారం వెల్లడిస్తారు. ఆయా రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని ఖచ్చితంగా ఇసి వెల్లడించనుంది. తమిళనాట మొత్తం 234 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉదయం 7గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రారంభం కాగా.. ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఇంధన భద్రతపై భారత్ దృష్టి

మొదటి పేజి తరువాయి..

ద్వారా నీటి ఎలక్ట్రాలిసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. రిఫైనరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

మొదటి పేజి తరువాయి..

ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామినిచచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝుల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

---------

## గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

మొదటి పేజి తరువాయి..


తర్వాత గొడ్డలిపోటుగా తేలిందన్నారు. వాళ్లే నేరం చేసి.. ఆ పాపాన్ని తమపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం నేరస్తులతో రాజకీయం చేస్తున్నాం' అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఏపీ పునర్‌నిర్మాణం చేస్తామని చెప్పాం.. చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పామన్నారు.

తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి జరగాలని.. సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులే కరెంట్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి రావాలని చెప్పుకొచ్చారు. రెండుమూడేళ్లలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ కరెంట్ అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏపీకి ఇప్పటికే రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని.. 22 నెలల్లో 800కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని సీఎం తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. 'ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకోండి.. రాయితీ ఇస్తాం' అని ప్రకటించారు. 23 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, 22 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.4 వేల కోట్లకుపైగా ట్రూడౌన్ ఛార్జీల భారం తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టాం. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలింది. ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశాం. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశాం. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి. మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయి. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వే వస్తాయని చంద్రబాబు అన్నారు.

# "పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు"

- **ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు మానేసి పథకాలు అమలు చేసే పనిలో ఉంటే మంచిది ;**
- **బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య**

**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 23,( చట్టం బ్యూరో)**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినీపల్లి మండలం కేంద్రంలోనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మట్లాడుతూ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టేను స్వాగతించిన మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య రాజకీయ కక్షసాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందన్న ఇప్పటికైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలి రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ పీసీసీ (రాజజ) నివేదికని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవ్వాళ అక్షరాలా నిజమని తేలిపోయింది తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని ఆయన పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని స్పష్టం చేశారు.

అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ పీసీసీ (రాజజ) నివేదికని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవ్వాళ అక్షరాల నిజమని తేలిపోయిందని వారు విమర్శించారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవ్వాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు.

ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజిలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన హితవు పలికారు.

గోదావరి జలాలను పక్క రాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలో వాతలు తప్పవని హెచ్చరించారు.

ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ మాజీ సర్పంచ్ చిందం రమేష్ కమల్ గౌడ్ పాల్గొన్నారు.

# టాటా ఏఐజి హెల్త్ ఇన్సూరెన్స్

### గుండి గోపాలరావుపేటలో సీనియర్ మెంటర్ బ్రాంచ్ ప్రారంభం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 23 ,(చట్టం బ్యూరో )** : మండలంలోని గుండి గోపాల్ రావు పేటలో సీనియర్ మెంటర్ పంజాల శ్రవణ్ గౌడ్ టాటా ఎఐజీ నూతన బ్రాంచిని టాటా ఏఐజి జోనల్ మేనేజర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ మేనేజర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, రీజనల్ మేనేజర్ వివేకానంద, సీనియర్ ఏరియా మేనేజర్ టేకుర్తి సంధ్య, ఏరియా మేనేజర్ దావూ శేఖర్, సీనియర్ ఛానల్ సేల్స్ మేనేజర్ కరబూజ సతీష్ లు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో సీనియర్ మెంటల్ బ్రాంచ్ ప్రారంభించడం చాలా సంతోషకరం అని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజల అవసరాల దృష్టా దూర ప్రాంతం వారికి సౌకర్యవంతంగా ఉండేందుకు మరిన్ని బ్రాంచీలు ఏర్పాటు చేయదలుచుకున్నాము అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టాటా ఏఐజి హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తూందని తెలిపారు. ఈరోజుల్లో ఆరోగ్య బీమా అనేది తప్పనిసరిగా మారిందని కరోనా తర్వాత అవగాహన పెరిగిందని అన్నారు. పెరుగుతున్న ఆసుపత్రి ఖర్చుల నుండి రక్షణ కొరకు ప్రతి కుటుంబానికి ఆరోగ్య భీమా అనేది తప్పనిసరి అన్నారు. ఎంతోమంది నిరుద్యోగులకు మా కంపెనీ ఉపాధి కలిగిస్తూ, ఎన్నో కుటుంబాలకు ఆరోగ్య భీమాను అందిస్తూ మా సలహాదారులు వారి ఆర్థిక రక్షణకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. బ్రాంచ్ ఏర్పాటు చేయుటకు ముందుకు వచ్చిన పంజాల శ్రవణ్ గౌడ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పంజాల శేఖర్, మెంటర్లు గర్వంద మధుకర్, పైండ్ల శ్రీనివాస్, బీమా సలహాదారులు పాల్గొన్నారు.



# మే డే వాల్ పోస్టర్ ఆవిష్కరణ..

- 141వ మేడే ఉత్సవాలను విజయవంతం చేయండి
- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్ పిలుపు



**పెగడపల్లి, ఏప్రిల్ 23( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం లో 141వ మేడే ఉత్సవాలను పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్,కార్మికులకు పిలుపునిచ్చారు.

పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మే డే ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా భూమేశ్వర్,మాట్లాడుతూ.. 1886లో చికాగో నగరంలో పని గంటల తగ్గింపు, పని భద్రత మరియు బానిసత్వ విముక్తి కోసం కార్మికులు జరిపిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.

నాటి పోరాటంలో పోలీసుల తూటాలకు బలైన అమరవీరుల రక్తంతో తడిసినదే ఈ ఎర్రజెండా అని ఆయన గుర్తు చేశారు. మే 1వ తేదీన గ్రామ గ్రామాన, పట్టణాలు, కార్ఖానాలు, లేబర్ అడ్డాలపై ఎర్రజెండాను ఎగురవేసి అమరవీరులకు జోహార్లు అర్పించాలని కోరారు.

నేడు కేంద్రంలోని మతోన్మాద శక్తులు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని భూమేశ్వర్,విమర్శించారు.

సంస్కరణల పేరుతో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా కుదించి, కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయడానికి కార్మిక వర్గం మరో విరోచిత పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, మండల అధ్యక్షుడు రాచర్ల సురేష్, నాయకులు ఆత్మకూరి రాజేష్, సుంకే ప్రకాష్, పాలమాకుల కుమార్, శ్రీరామ్ పోచయ్య, బాస్కె శ్రీను, సిగిరి రాజ్ కుమార్, మల్లారపు సురేష్, ఆరెల్లి రాజు, కొత్తూరి చందు, కొల్లిపాక స్వామి, నంబాల కిషన్, మహంకాళి ఆకాష్, గంగాధర బాబు, గంగాధర మల్లేశం, తోడేటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# నామపూర్ గ్రామంలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రం ప్రారంభం.



**పెగడపల్లి, ఏప్రిల్ 23 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని నామపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ చిర్ర రజిత–రమణాకర్ గారితో కలిసి మండల తహసీల్దార్ నిజాముద్దీన్, పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చిర్ర రజిత–రమణాకర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలగందుల విష్ణు, వార్డు సభ్యులు దప్పు లచ్చయ్య, గుమ్మడి స్వప్న–ప్రేమ్ సాగర్, లెంకల రజిత–గంగరాజు, మాజీ సర్పంచ్ ఇనుగండ్ల కర్ణాకర్ రెడ్డి,మండల ఆర్ ఐ శ్రీనివాస్ బిఆర్ఎస్ నాయకులు జాగిరి వెంకట రమణ,దండవేణి లింగయ్య, అరెల్లి ప్రభాకర్,ఉయ్యాల సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంధి మల్లరెడ్డి, దప్పు నర్సయ్య, ముందుగంటి పవన్, ఇనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి, అనురెడ్డి సంతోష్ రెడ్డి, సి ఎ లు చాడ ప్రభావతి, ఎండీ జూలేఖ, పాలొజీ భాగ్య, పాలొజీ శ్యామల, మాజీ ఎంపీటీసీ పద్మ, రైతులు ఉప్పుల లక్ష్మ రెడ్డి, నల్ల మల్లారెడ్డి గార్లు మరియు ఐకేపీ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# ఎస్.ఆర్.ఆర్ కళాశాల అడ్మిషన్ల పెంపుదలకు అధ్యాపకులు కృషి చేయాలి






**ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ;**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 23,( చట్టం బ్యూరో) :** స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్ లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్ల పెంపుదలపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షతన అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అధ్యాపకులందరూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులతో సంప్రదింపులు జరిపి, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సుల గురించి వివరించి, విద్యార్థులు ఎస్.ఆర్.ఆర్ కళాశాలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందేలా ప్రోత్సహించాలని కోరారు.

దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ దోస్త్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను వివరించారు. మొదటి విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు మే 7 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఏప్రిల్ 30 నుండి మే 8 వరకు వెబ్ ఆప్షన్ల ద్వారా కోర్సులు, కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, మే 14న సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. కేటాయింపు పొందిన విద్యార్థులు మే 15 నుండి మే 23 వరకు ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ దోస్త్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను విద్యార్థులకు విస్తృతంగా తెలియజేయాలని అధ్యాపకులను కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్, టి. రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ హర్జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఆంగ్లభాషా దినోత్సవం



**కొడిమ్యాల, ఏప్రిల్ 23(చట్టం) :** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పెల్ బీ, డిబేట్ , కథా రచన, కవితా రచన, వ్యాస రచన, పోస్టర్, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.లావణ్య మాట్లాడుతూ..ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాషోపాధ్యాయులు జి.వి.రమణ, రాజేశం, ఉపాధ్యాయులు ప్రణీత, తబస్సుమ్, భాగ్యలక్ష్మి, పద్మప్రియ, శరణ్య, శిరీష, ప్రమోద, రోహిణి, సౌజన్య, అంజలి, అరుణ, సుధారాణి, విజయ్ కుమార్, మల్లేశం, శ్రీధర్, మహేందర్, సత్యానందం, అనూప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్‌లకు సన్మానం.



**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, ఏప్రిల్ 23 (చట్టం న్యూస్) :** ఇటీవల ఎన్నికైన తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ లను శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, రాష్ట్ర కోశాధికారి కార్యదర్శి వడ్లకొండ కుమారస్వామి సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం సగర, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్రవంతి సగర, మారుతి సగర, హరికిషన్ సగర లు శాలువా కప్పి మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతురాలు, సగర బిడ్డ చిన్న వయసులో మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నిక కావడం సగర కులానికి గర్వకారణమని అన్నారు. ప్రజా సేవలో ముందుండి మంచి ప్రజా ప్రతినిధిగా గుర్తింపు తీసుకురావాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ మాట్లాడుతూ తమను సగర రాష్ట్ర కమిటీ, సగర కులస్తులు సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.

**ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య**




**పెగడపల్లి, ఏప్రిల్ 23 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని నామపూర్ గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథి గ్రామ సర్పంచ్ చిర్ర రజిత–రమణాకర్, హాజరై ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధడి సులోచన, ఉపాధ్యాయులు నాగభూషణం, పద్మజ , వీరన్న, సుప్రియ మరియు గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు...

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జలాల్పూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**భూదాన్ పోచంపల్లి ; ఏప్రిల్ 23 (చట్టం ప్రతినిధి) :** రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు . పట్టణ పరిధిలోని రెవనెపల్లి మండల పరిధిలోని జలాల్పురం , శివారెడ్డి గూడెం , జూలూరు గ్రామంలో పిఎసి ఎస్ ఐకెపి మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి దాన్యం గింజలు కొనుగోలు చేస్తామన్నారు . ధాన్యం విక్రయించిన రైతు ఖాతాలో 48 గంటల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు . రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రైతులని ఆదేశించారు . కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ తడక వెంకటేశ్వర్లు , భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రేఖ , వైస్ చైర్మన్ కొయ్యడ రజని , తాహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి , పురపాలిక కమిషనర్ అంజన్ రెడ్డి , కౌన్సిలర్లు ఆయా గ్రామ సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

# బుగ్వేదంలో ఆగిరిపల్లి విద్యార్థుల ప్రతిభ



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 23 చట్టం ప్రతినిధి :** కంచి పీఠం వారు నిర్వహించిన పరీక్షలకు ఆగిరిపల్లి శ్రీ శోభనాద్రి లక్ష్మీ నృసింహ స్వామి వేదశాస్త్ర పాఠశాల నుండి 4గురు బుగ్వేద విద్యార్థులు హాజరు కాగా , నలుగురు విద్యార్థులు బుగ్వేదం మూలాంత భాగములో ఉత్తీర్ణత పొందారు. ఆకొండి కార్తీక్ శర్మ (అన్నవరం) ఉత్తమ శ్రేణి యందు ఉత్తీర్ణత కాగా కళ్లేపల్లి శ్రవణ్ కుమార్ (గుంతకల్లు), ఆకొండి వ్యాస మూర్తి ( అన్నవరం) ఇద్దరు విద్యార్థులు ప్రథమ శ్రేణి యందు ఉత్తీర్ణత పొందారు. శతపతి సాయిచరణ్ ( విశాఖపట్నం) ద్వితీయ శ్రేణి యందు ఉత్తీర్ణత పొందారు. 21వ తేదీన కంచి పీఠాదీశ్వరులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో విద్యార్థులు జయ పత్రికలను అందుకున్నారు. స్వామి వారు ప్రత్యేకంగా ఆగిరిపల్లి వేదశాస్త్ర పాఠశాల గురించి ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇంకా ఎంతో ఉన్నతి స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఆశీస్సులు తెలియచేశారు. విద్యార్థులకు బుగ్వేద పాఠం బోధించిన గురువులు శ్రీ గొట్టిముక్కల సాయికిరణ్ ( సలక్షణ ఘనపాఠి) గారికి పాఠశాల కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియచేశారు. విద్యార్థులు గురువుల ఆశీస్సులు తీసుకున్నారు.

# అన్ లిమిటెడ్ టు లిమిటెడ్



**కొడిమ్యాల, ఏప్రిల్ 23 (చట్టం) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల సమ్మెతో బస్సులు తక్కువ సంఖ్యలో పరిమిత ప్రయాణికులతో నడుస్తున్నాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రయాణం చేసే ప్రయాణికులు మాత్రమే ప్రయాణం చేస్తుండడంతో అపరిమిత ఉచిత ప్రయాణికుల రద్దీ నుండి ఈ ప్రయాణికులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. అదే విధంగా పురుషులకు బస్సుల్లో ఉచిత జర్నీ లభిస్తుండడంతో పురుష ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమ్మెతో బస్సులు, ప్రయాణ ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి.

# సెమీఫైనల్‌కు చేరిన బోయిన్పల్లి జట్టు

**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 23,( చట్టం బ్యూరో ) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా బోయినపల్లి జట్టు సెమి ఫైనల్ కు దూసుకెళ్లింది గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోయినపల్లి ఎల్లారెడ్డిపేట జట్లు కనపడగా ఎల్లారెడ్డిపేట మొదట బ్యాటింగ్ చేసి 74 పరుగులు చేయగా బోయినపల్లి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీస్ కు దూసుకెళ్లింది.మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జంగం ప్రశాంత్ అందుకున్నారు.ఈ సందర్భంగా బోయినపల్లి జట్టును బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కత్తెర పాక కొండయ్య,బి .ఆర్. ఎస్ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ ,మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య లు శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు చీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

## తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

**అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి వారికుంది**

**రాణీగంజ్ డిపోముందు సంఘీభావం పలికిన తలసాని**

హైదరాబాద్,ఏప్రిల్ 23 : ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ సమ్మెలో ఉద్రిక్తత

**పెట్రోల్ పోసుకుని డ్రైవర్ ఆత్మహత్యాయత్నం**

వరంగల్,ఏప్రిల్23 : ఆర్టీసీ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం తీవ్ర సంచలనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో దిగిన ఆర్టీసీ కార్మికులు రెండోరోజు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం నర్సంపేట డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న డ్రైవర్ కోలా రమేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సహచర కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసి తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- **ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు**
- **బలవంతంగా నడడిపేందుకు యత్నాలు**
- **పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**హైదరాబాద్,ఏప్రిల్23 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

**తాండూరులో టెంట్ సామాను ఇవ్వకుండా పోలీసుల ఒత్తిడి**

**రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ తలసాని**

హైదరాబాద్,ఏప్రిల్23 : ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని,

తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ

ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం



అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేస్తామని ఎల్అండ్‌టీ ముందుకు వస్తే బెదిరించారని తెలిపారు . మేడిగడ్డ కుంగినప్పుడు ఆగమేఘాల మీద వచ్చిన ఎన్డీఎస్ఏ , ఎస్ఎల్‌బీసీ కుంగి 8 మంది చనిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యం వచ్చింది.వచ్చిన ధాన్యం చూసి కేంద్రమే ఆశ్చర్యపోయింది. ఆఖరికి వరి కొనలేమని కేంద్రం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేత కాదని, అన్ని వర్గాల వారు ప్రభుత్వం పై కోపంతో ఉన్నారని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ , బీఆర్ఎస్ ఖైరతా బాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి , కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి , బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె . కిషోర్ గౌడ్ పాల్గొన్నారు ,

## కాలేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్,ఏప్రిల్23 : కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## బెంగాల్లోనూ పోటెత్తిన జనం

**ఓటేసేందుకు భారీగా తరలివచ్చిన ఓటర్లు**

**దాదాపు 90శాతం వరకు పోలింగ్ నమోదు**

**చెదురు ముదరు ఘటనలు మినహా ప్రశాంతం**

**కోల్‌కతా,ఏప్రిల్23 :** పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ భారీ రికార్డుల్ని క్రియేట్ చేస్తోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ సెంటర్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు బెంగాల్‌లో 90 శాతం మేర ఓటింగ్ నమోదైంది. చాలా మంది ఇంకా క్యూ లైన్లలో నిలిచి ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా బెంగాల్‌లో 152 స్థానాలకు గురువారం ఓటింగ్ జరిగింది. బెంగాల్‌లో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు 294 కాగా, రెండోదైన చివరి విడత పోలింగ్ 142 స్థానాలకు ఏప్రిల్ 29న జరుగనుంది. పోలింగ్ సరళిని చూస్తే అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), ప్రతిపక్ష బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. బెంగాల్ మొదటి విడత ఎన్నికల్లో 1478 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బెంగాల్ ఎన్నికల్లో మరోవైపు హింస చెలరేగింది. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఏయూజేపీ పార్టీ చీఫ్ హుమాయున్ కబీర్‌పై దాడులు చేశారు. సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కుమార్‌గంజ్‌లో బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ గుండాలు దాడికి పాల్పడ్డారు. మరోవైపు, ఈ ఓటింగ్ చూస్తే ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై ప్రజల కోపాన్ని సూచిస్తోందని ఇది టీఎంసీకి అనుకూలమే అని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, మే 4 టీఎంసీకి గుడ్ బై అంటూ బీజేపీ చెబుతోంది. గంటగంటకు పోలింగ్ పెరుగుతుండటంతో అధికార వ్యతిరేక ఓటింగ్ నమోదవుతున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

## మనోహర్‌కు పవన్ కళ్యాణ్ ఫోన్

**తండ్రి మరణపై పరామర్శ**

**అమరావతి,ఏప్రిల్23 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణంపై తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఏపీ కేబినెట్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నారు. నాదెండ్ల మనోహర్‌ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోన్లో పరామర్శించారు. శస్త్రచికిత్స జరగటంతో బయటకురాలేని పరిస్థితిలో నాదెండ్ల భాస్కర రావు అంత్యక్రియల్లో పాల్గొనలేకపోతున్నానని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషాదం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భాస్కరరావు మృతికి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. 1935 జూన్ 23న గుంటూరులో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. ఆయన వృత్తిరీత్యా లాయర్ కాగా.. కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయన 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. నాదెండ్ల భాస్కరరావు కాంగ్రెస్ పార్టీని వీడి 1982లో ఎన్టీఆర్ వెంట నడిచారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం నాదెండ్ల భాస్కరరావు రాజకీయ వారసుడిగా కుమారుడు మంత్రి నాదెండ్ల మనోహర్ కొనసాగుతున్నారు.

## తొలిదశ ఎన్నికల వేళ

**పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి**

కోల్‌కతా,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతంలోగల ఒక పోలింగ్ బూత్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాలపాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

## ఓటు వేయడం బాధ్యతగా గుర్తించండి

**తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు**

న్యూఢిల్లీ,ఏప్రిల్23 : తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గత రికార్డులను తిరగరాస్తూ, ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరగాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పండుగలో పౌరులందరూ చురుగ్గా పాల్గొని.. పారదర్శకమైన, పటిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో తమ వంతు సహకారం అందించాలని 'ఎక్స్' వేదికగా ఆయన సందేశాన్ని పంచుకున్నారు.

## హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణ

**మేఘావృతమై ఉరుములతో చిరుజల్లులు**

**హైదరాబాద్,ఏప్రిల్23 :** హైదరాబాద్ మహానగరంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండలు దంచి కొట్టగా.. ఆ తర్వాత ఉన్నట్టుండి వాతావరణం మేఘావృతం అయ్యింది. ఆకాశం మేఘావృతమై ఉరుములతో పలుచోట్ల చిరుజల్లుల కురిసాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావం నెలకొందని వాతావరణశాఖ వెల్లడించింది. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

# ఏయూ శతాబ్ది వేడుకల్లో ఎన్‌బీఎం న్యాయ కళాశాల ఘనత






- **ఉత్తమ అనుబంధ కళాశాలగా ఎన్‌బీఎం గుర్తింపు**
- **మాజీ ఉపరాష్ట్రపతి డీన్ డీవీ రమణకు ప్రత్యేక సన్మానం**
- **మొత్తం ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు కైవసం**
- **న్యాయ విద్యార్థులకు వెంకయ్య నాయుడు మార్గదర్శనం**

విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం ఏయూ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమం వైభవంగా జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన 'లెక్స్ ఎమినెన్స్' కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ అనుబంధ కళాశాలగా నిలిచిన ఎన్‌బీఎం న్యాయ కళాశాల ప్రత్యేక గుర్తింపు పొందింది. కళాశాలకు మొత్తం ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. డీన్ డా. డీవీ రమణకు దీర్ఘకాలం ప్రిన్సిపాల్‌గా సేవలందించినందుకు అవార్డు ప్రదానం చేయగా, ఆయనను వెంకయ్య నాయుడు సన్మానించారు. కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మాతృభాష తల్లితో సమానమని, ఆంగ్ల భాష కళ్లజోడు వంటిదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులు, మాతృభాషను ఎప్పటికీ మరవకూడదని సూచించారు. పల్లెటూరి నుంచి కష్టపడి ఎదిగిన తన ప్రయాణాన్ని వివరించి, కృషి చేస్తే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరవచ్చని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. న్యాయవాదులు న్యాయం వైపు నిలబడి పనిచేయాలని, సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మహిళలపై దాడులను అరికట్టేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక అవకాశాలను యువత వినియోగించుకోవాలని సూచించారు. భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిందని గుర్తుచేశారు. అవినీతి నియంత్రణలో న్యాయవాదుల పాత్ర కీలకమని పేర్కొంటూ, పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, భారతీయ విలువల పరిరక్షణపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.ఎం న్యాయ కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి ,న్యాయవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌బీఎం న్యాయ కళాశాల సాధించిన ఈ విజయంపై హర్షాతిరేకం వ్యక్తమైంది.

# రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 23 ,( చట్టం బ్యూరో) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, మల్లారం, వేములవాడ పట్టణంలోని బాలా నగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.
ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు? ఆన్ లైన్ లో వెంటనే నమోదు చేశారా లేదా? అనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

#### ధాన్యం ఎప్పటికప్పుడు దింపుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు. మర్రిపల్లిలోని మణికంఠ ఇండస్ట్రీస్, మారుతి ఇండస్ట్రీస్ లు, వేములవాడ పట్టణంలోని శ్రీ



రామలింగేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 23,( చట్టం బ్యూరో ) :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ కోరారు.
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాజీ డి సి ఎం ఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ ల తో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్ట పడి పండించిన పంట దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని





వసతులు కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యూసుఫ్ మొయినుద్దీన్,ఎంపీడీవో జయశీల,సొసైటీ ప్రత్యేక అధికారి గౌస్,వ్యవసాయ అధికారి ప్రణీత,సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వేసిరెడ్డి దుర్గారెడ్డి,నాయకులు కొప్పుల నగేష్,అక్కనపల్లి ఉపేందర్,ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లు ,నాయకులు ఉన్నారు

# స్వచ్ఛ రథం సేవలను సద్వినియోగం చేసుకోండి....

### ఎంపీడీవో మమతా దేవి..



**నార్పల, ఏప్రిల్ 23, (చట్టం) న్యూస్ :** నార్పల మండల ప్రజలు స్వచ్ఛరథం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మమతా దేవి అన్నారు మండల వ్యాప్తంగా ఇళ్లలో ఉన్నటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిళ్లు, డ్రిప్పు పైపులు, స్టీలు, అల్యూమినియం, ఇనుము, పాత పుస్తకాలు పేపర్లు, తదితర వ్యర్థాలను మీ గ్రామానికి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు అందచేస్తే దాని విలువను బట్టి నిత్యవసర సరుకులు అందజేస్తారని తెలిపారు ప్రతినెల గ్రామాల వారీగా స్వచ్ఛరథం షెడ్యూల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ నెల 23వ తేదీ గూగూడు , 24 నాయన పల్లి 25 వెంకటాంపల్లి 2007 నార్పల 28 కేసే పల్లి, 29 దుగుమర్రి, 30వ తేదీ సిద్ధిరాచర్ల గ్రామాలకు స్వచ్ఛ రథం వస్తుందని తెలిపారు.. స్వచ్ఛ రథం ద్వారా 2106.5 కేజీల అన్ని రకాల వ్యర్థాలు సేకరించి 27వేల 954 రూపాయల విలువ చేసే నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మమతాదేవి తెలిపారు..

# అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్





**రాయికల్ ఏప్రిల్ 23 చట్టం :** ఐసిడిఎస్ జగిత్యాల్ ఆధ్వర్యంలో గురువారం రాయికల్ మండలం వడ్డెర కాలనీ, ఇటిక్యాల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు అనూహ్య, పద్మావతి లు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాల ప్రాధాన్యత, పోషకాల విలువల గురించి వివరించారు. అనంతరం ఏడు నెలల పిల్లలకి అన్నప్రాసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు బోదాసు రాజేష్, నాగిరెడ్డి సాయిరెడ్డి, గ్రామ కార్యదర్శి దివ్య జ్యోతి, అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత, సువర్ణ, సహారా, బుజ్జమ్మ, సుజాత, అనురాధ, రమ్య, ఎఎన్ఎమ్ భాగ్యలక్ష్మి, రజిత ప్రీస్కూల్ పిల్లలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయుల వసతి గృహాల తనిఖీ..!



**కర్నూల్, చట్టం న్యూస్ (23 ఏప్రిల్ 2026):**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మద్దూర్ నగర్ నందు గల వేదాస్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మరియు అశోక్ నగర్ పంప్ హౌస్ దగ్గర గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడి వారిని అడిగి వారికీ అందించే భోజన, వసతి, వైద్య సదుపాయలను గురించి తెలుసు కొని సంతృప్తి వక్తం చేసారు. వృద్ధులకు నిరాశ్రయులకు లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించి ఏవైనా సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేస్తే వారి చట్ట పరమైన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది రాంపుల్లయ్య, వేదాస్ వసతి గృహ నిర్వాహకురాలు పరమేశ్వరి తదితరులు పాల్గొనారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొన్న బి ఆర్ ఎస్ నేతలు ;





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 23,( చట్టం బ్యూరో ) :** తమ పెళ్లిరోజు సందర్భంగా కరీంనగర్ శ్రీపురం కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తదనంతరం వారి ఇంటి ఆవరణలో చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ , బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మొక్క నాటిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు శశికళ పాల్గొన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ మాజీ మండల అధ్యక్షుడు మెడుదుల మల్లేశం కొండగట్టు మాజీ డైరెక్టర్ ముద్దం రవి కిషన్ తిరుపతి అనిల్ మధు మరియు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యం

### వార్డు సభ్యులు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా / ఏప్రిల్ 23 ,(చట్టం న్యూస్ ) :** తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామని వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులకు ఇన్సూరెన్స్ లు గౌరవ వేతనం కల్పించాలని కోరారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర మంత్రులను ప్రతిపక్ష నాయకులను ఎమ్మెల్యేలను కలసి వార్డు సభ్యుల సమస్యల పట్ల వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్,బత్తిని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా ధర్మపురి



**రాయికల్ ఏప్రిల్ 23 చట్టం :** రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా కల్లెడ చిన్న ధర్మపురి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా వేముల మౌనిక, కార్యదర్శిగా పుర్రె శ్రీధర్, ఫ్లోర్ విప్ గా కూనారపు మానస లు ఇట్టి నియామక పత్రాన్ని గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇట్టి నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు గారికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి, పట్టణ అధ్యక్షులు కూర్మ మల్లారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాజాపా పట్టణ ప్రధాన కార్యదర్శిలు కునారపు భూమేష్, బన్న సంజీవ్, ఉపాధ్యక్షులు కడార్ల శ్రీనివాస్, అల్లె నరసయ్య, సింగని సతీష్, నాయకులు తోపరపు సురేష్, సామల సతీష్, భూత్ అధ్యక్షులు శ్రీ గద్దె సుమన్, అందే శంకర్, దాసరి సంతోష్ మహిళా మోర్చా నాయకులు వాసం రమ తదితరులు పాల్గొన్నారు.

## అందని అధికారం

(గుప్పెట్లో పగ్గాలు)

రిజర్వేషన్ పేరుతో సాగుతున్నది పెత్తందారుల బొమ్మలాట.
ప్రజాప్రతినిధిని తోలుబొమ్మను చేసి, కీలుబొమ్మగా ఆడిస్తున్నారు.
గంగిరెద్దుల్ని ఆడించే దూడూ బసవన్నలే ఈ పార్టీ పెద్దలు.

ఇది రిజర్వేషన్ వర్గాలు కోలుకోకుండా చేస్తున్న రాజకీయ కుట్ర.
ఎన్నికలప్పుడు రిజర్వేషన్లకు తూట్లు పొడిచేది పార్టీ శ్రేణులే.

రిజర్వేషన్ ఎమ్మెల్యే ఆధిపత్య వర్గాల చెప్పుచేతల్లోనే ఉండాలని చూస్తారు.
మాట వినకపోతే "మళ్లీ టికెట్టు లేదు" అని బెదిరిస్తారు.
ప్రశ్నిస్తే "పార్టీ ద్రోహి" అనే ముద్ర వేస్తారు.

అవినీతిని, దోపిడీని ఎదిరిస్తే ఎమ్మెల్యే పదవికే ఎసరు వస్తుంది.
అందుకే "నియోజకవర్గ ఇన్‌ఛార్జ్"లను నియమిస్తారు.
పేరుకు ఎమ్మెల్యే, పెత్తనం అంతా ఇన్‌ఛార్జ్‌దే. అదే అందని అధికారం.

సీటు ఇచ్చారు. సింహాసనం మీద కూర్చోబెట్టి, కాళ్లకు అదృశ్య సంకెళ్లు వేశారు.
మైకు ఇచ్చారు. కానీ స్క్రిప్ట్ వాళ్లదే.
హోదా ఇచ్చారు. కానీ నిర్ణయించే అధికారం ఇవ్వలేదు. రింగ్ మాస్టర్ ఎప్పుడూ ఆధిపత్య వర్గాల వాడే.

పార్టీ జెండా మోసిన స్థానికుడికి టికెట్టు ఇవ్వడంలో మొండిచెయ్యి చూపుతారు.
స్థానికేతరుడికి టికెట్టు ఇవ్వడంలో మాత్రం అమృత హస్తం.

ఊరుకాని వాడికి ఊరు పేరు తెలియదు, ఊసే తెలియదు.
గెలిచినా ఓడినా మళ్లీ ఈ గడ్డ మీద కాలు పెట్టదని వాళ్ల వ్యూహం.

వాళ్లకు కావాల్సింది ప్రాతినిధ్యం కాదు. "పార్టీలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు" అని చెప్పుకోవడమే.

రిజర్వేషన్ కొందరికే వారసత్వపు ఆస్తి. కొందరికి అది అందని ద్రాక్ష.

దశాబ్దాలుగా కొన్ని కుటుంబాలకే రిజర్వేషన్ కోటా దక్కుతోంది.
ఇందుకు కోకొల్లలుగా దాఖలాలు ఉన్నాయి.

క్రీమీ లేయర్లకే మళ్లీ రిజర్వేషన్ ఫలాలు దక్కుతున్నాయి.
అట్టడుగున ఉన్నవాడికి రిజర్వేషన్ అందని ద్రాక్ష. నిర్ణయించే అధికారం దరిదాపుల్లో కూడా లేదు.

రిజర్వేషన్ అనే ఊతకర్ర ఆధిపత్య వర్గాల చేతిలో దుడ్డుకర్ర అయింది.

స్థానికుడికి టికెట్టు నిరాకరణ వెనుక ఉన్న ఎత్తుగడ ఒక్కటే:
"ఆడదాన్ని కూర్చోబెట్టు, అధికారం మనం చెలాయిద్దాం".
పేరుకు సాధికారత, సమానత్వం. తీరా చూస్తే ప్రాక్సీ పాలనకు తెరలేపారు.

మహిళా కోటా ఎమ్మెల్యే అయినా అది డబుల్ రిజర్వేషన్ కాదు. డబుల్ బానిసత్వం.

ఇనుప సంకెళ్లు కనిపించవు. కానీ బానిస సంకెళ్లు ఉన్నాయి.
కులం, లింగం, వారసత్వం అనేవి అదృశ్య సంకెళ్లు.

సీటు దళితులది. అధికారం మాత్రం ఇన్‌ఛార్జ్‌ల గుప్పిట్లోనిది.
రిజర్వేషన్లో అద్దెకు తెచ్చుకున్న స్థానికేతరులకు అవకాశం కల్పించి, రిజర్వేషన్ల ఉద్దేశాన్నే ఉల్లంఘిస్తున్నారు.

కుర్చీ ఉన్నా కూలీనే.
పదవి ఉన్నా బానిసే.

– రచన: ఆనగల్లు మునిరత్నం
శాక్యముని ఫౌండేషన్, వ్యవస్థాపకులు
పూతలపట్టు, చిత్తూరు



## " ప్రాణనాధుడు.. నా సూరీడు "



-స్నేహం నా వనం..
జీవనం, నాదం, నినాదం
ఇజం, సుజలాం, ఏకీకృత సిద్ధాంతం
ఎజెండా ఒక్కటే, రూపురేఖలు బిన్నం,
-నేస్తానికి సుకృతి,అనువాదం,అనురాగం, అభిమానం కరుణ దయ,లేదు -వివాదం,నిదానం,సంవిధానం, చెయ్యాలి బహుళ రూప దానం,
-నేస్తం సుమధుర గీతం, ఇది జీవన వేదం, దేవుని పాదం, జీవితం, గణితం, తీపిలో సీతాఫలం,వద్దు ప్రతిఫలం..
-భవిత కోసం బంధం, కావాలి సుగంధం, కాకూడదు దుర్గంధం
-రక్షానుభంధం ఇరువురికి
రక్త బంధాలు లేకున్నా,పవిత్ర బంధం, గ్రంథం, గంధము ఆత్మ, అంతర్గత సౌందర్యం,
-నైతికత లేని నేస్తం జీవితం వ్యర్ధం, సార్ధకత లేని క్రియలు క్రిములు,
-స్నేహానికి ఒకే ఆత్మ, రెండు దేహాలు,ఉషస్సుతో కూడిన ఛందస్సు,వ్యాకరణం మేధస్సు మార్పిడి కోసం,
-కలతలు లేని స్నేహలత, మగత లేని మత్తు, వడగాల్పు -శిల్పులు ఇద్దరు, శిల్పం ఒక్కటే,నేను వుండగా ఎలా చింత?నేస్తం వుండగా నీ చెంత? -రాళ్ళతో రాగాలు పాడించే స్నేహం తల్లి, తండ్రి, గురుదైవంతో సమానీకృతం
-నీవు లేని స్థానాన్ని నేను పూరిస్తా ,ధ్యేయాలను సాధిస్తా,సామాజికతపై దృష్టిని సారిస్తా, నేస్తంను నిర్వచిస్తా,
-నేస్తం ఆద్యంతం మెరుపు,వెలుగు జిలుగులు,
ఒక వైపు స్నేహం విశ్వసింపరాదు, నేస్తం కాలాన్ని అపహరించు, కాలనిర్వహణ, సమయ పాలన పాటించు, -జీవితంలో నేస్తం, నేస్తమే
జీవిత సర్వాస్త్రం కాదు ,మనసు, ఆంతర్యం నచ్చిన నా ప్రాణనాధుడు, సూరీడు
-నా గర్భంలో ప్రసవం, పునర్జన్మ కోసం వేచి ఉన్నాడు,ఆ ప్రాణ నేస్తం కోసం వేచి ఉన్నా..నిరంతర నిరీక్షణ, రక్షణ కోసం,

-చందు ఆంజనేయులు విశ్రాంత ప్రాచార్యులు

## భామామణి బామము (పదాల పదనిసలు)



పారిజాత ప్రసూనమునకై సత్యభామ వదనములో అలకలు,

పరంధామునిపై కోపమును చూపుటకు చేసిన కులుకులు,

అబ్బో, నయనములకు నందమును కలిగించు తళుకులు,

అనునాయికల ముందు ఆమె చూపెడి బెళుకులు,

కినుకతో వయ్యారమును కనిపించెడి భామామణి నడకలు,

కన్నయ్య మీద కోపమున పలికెడి పలుకులు,

కావే గుండెలో గుచ్చుకొన్న పదునైన ములుకులు,

ఆమె పదములలో కానవచ్చెడి విచిత్రమైన మెలికలు,


ముదిత సత్యా కృష్ణునిపై వేసెడి ముచ్చటైన చురకలు,

ముక్కు తిమ్మన వ్రాసిన కావ్యము లోని పంచదార చిలకలు!!

(బామము = కోపము
అనునాయిక = పరిచారిక)


డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

## గ్రామ స్వరాజ్యం..!




దేశానికి గ్రామాలు పట్టు కొమ్మలు
ప్రగతి చిహ్నాలు
జీవ నాడులు.
స్వపరిపాలన జరుపుకొంటూ
నిత్యం నూతనత్వం అందుకొంటూ
గ్రామ అభివృద్ధి చేసుకొంటూ
మౌలిక వసతులు పెంచుకొంటూ
ఎదుగుతున్నాయి గ్రామాలు
మన పల్లెలు.
గ్రామ స్వరాజ్యం వికశిస్తోంది
విద్య, వైద్యం అందుకొంటోంది
సాంకేతిక పరిజ్ఞానం
పెంచుకొంటుంది
అనూహ్య విజయాలు పొందుతోంది.
పంచాయితీ కార్యదర్శి సహకారం
సర్పంచ్ దూరదృష్టి
పాలకవర్గం ఐక్యత
పరిపాలన దక్షత
అంతా ఒక్కటై
పల్లె ఎదుగుతోంది
ఆదర్శంగా నిలుస్తోంది.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం



## కర్షకపుత్రుడు -- జగతికి మిత్రుడు :



తెలుగు జాతికిఆప్తుడు
విశ్వ జన మిత్రుడు
అమరపురిఅమరావతి
కి ప్రియ నేస్తుడు
నిత్య స్వాప్నికుడు
నిరంతరశ్రామికుడు

అవని పుత్రుడు అమృత హస్తుడు
ఆకలిమంటలఅర్ధాకలి రైతుబిడ్డడు
ఇలలో రైతుల వ్యధలు తెలిసినోడు
ఈసురో మన్న నేటి రైతుకు అభయహస్తుడు

వ్యవసాయం ఉనికిని కోల్పో తున్న తరుణమిది
అందించాడు ఊరువాడజల ధార ల జలనిధి
కర్షక మదికి ఊపిరి లూదు తున్న శుభ తరుణమది
చెరువులు,కుంటలు కాలువలు నీటితో నింపుతున్నాడు

పచ్చని పైరు పంటలతో పుడమితల్లిని మెప్పిస్తున్నాడు
సకలజీవులకు ప్రాణవాయువులకులిస్తున్నాడు.
ఏమరి పాటుగానుండని నిరంతరకృషీ వలుడు
ఐనంతవరకు కూటమితో కలిసి పయనం చేస్తున్నాడు

ఓటమిఎరుగని విజనున్న నాయకుడు

ఔ నన్నా కాదన్నా రాష్ట్రవెతలుబాపునావికుడు
ముందు చూపు ఉన్న మరో మంచి నాయకుడు
నేటి రైతు వ్యవస్థలో బతుకు బండికి ఇందనమతడు
కరువు నేలను తడిపిన అపర భగీరదుడు ఈ చంద్రుడు

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
విశ్రాంత ఉపాధ్యాయులు, కవి, రచయిత.
వి. కోట. చిత్తూరు జిల్లా.
చరవాణి :-9000169823.

## నామనోనేత్రాన నారాయణా



శరణమయాహరి కరుణాసాగర
కరవుదీర మనసు కనుల నిల్వర

కరదోయిని జోడించి సరోజాక్షు వీక్షించ
పరధ్యానరహిత ప్రశాంతాత్మ నింగాంచ
హరిరూప మద్గడుగున స్మృతికరుదెంచ
కరుగని తరుగని సిరిమనోహరెద నర్థించ

అణువణువున కణకణము నందునను
అణకువ మెలకువ ఆర్ద్రతల గందురను
క్షణక్షణము హృదయాలయాన నిను
కనగవినగ తన్వున భగవాను నిల్పుదును

శాంతి యశనాన్ని దయసేయు మెదలో
కాంతికణపు తెరమరుగేల ఈ బగతునిలో

భ్రాంతిని తొలగజేయు మంతర్యామీ నాలో
వింతానుభవాను భూతుల మేల్కొల్పుమయా
పరమభావాన పరమాత్మా జయమిడు
తిరు వేంకటేశ్వర కరుణజూపు మిడు
చారుదరిసెనము సకల ప్రాణముల నిడు
తిరుదారి సన్నిధి తిరిపెమడ్గని బ్రతుకిడు

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

## ఓ చెలీ !



ఓ చెలీ !
కనులు మూసినా
కనులు తెరిచినా
నీ జ్ఞాపకాలే
ఎక్కడ ఉన్నా
ఏమి చేస్తున్న
ఎవరితో మాట్లాడినా
నీ ప్రస్తావనే
నీ నవ్వు
నీ ముఖకవళికలు
నీ మాటలు
నీవు చెప్పె కహానీలు
నీవు చేసే హడావుడి
నేను మరవలేకపోతున్న
నీ పరిచయం
నాలో కొత్త ఉత్సాహం ఉత్తేజం
ఏమి చేయలేను
అంతా భ్రాంతి
అనుకునే నాలో
కొత్త ఆలోచనలు
కొత్త ఆశలు ఆశయాలు
ప్రపంచాన్ని జయిస్తాననే భరోసా
ఓ ప్రియా !
నాలో ఉన్న ప్రతిభను
నాకు గుర్తు చేసి
నాలో ఉన్న కవిని
తట్టి లేపావు
ఓ ప్రియతమా !
నాలో ధైర్యాన్ని నింపి
నా బలం
బలగం
నీవే అన్నట్లు చేశావు
చెలి ! ప్రియా !! ప్రియతమా ! అని ఎట్ల పిలిచినా
ఇంకా ఏదో కోల్పోయిన భావన
నాలో మొత్తం నీవే
అయినప్పుడు
ఏమని పిలిచినా
తక్కువే మరి
నాకాలం నీవే
కాలం లో మిగిలి
పోయే తాపత్రయం
తపనవు నీవే !

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
సైదాబాద్, హైద్రాబాద్.

## పుస్తకం

ఒకసారి చేస్తే దస్తకం
మరవరు మంచి నేస్తం
పుస్తకం పఠనం తో వికసించేను మనసు మస్తికం
పుస్తకం ఒక విజ్ఞాన భాండా గారం
పుస్తకం ఒక వ్యాపకం
విషయ పరిజ్ఞానం
విషదీకరణకు మూలం
వయసుకు అడ్డు రానిది
పుస్తకం
ఇది అందరికీ తెలిసిన
ఒక
అధ్యాయం
తాళ్ల పత్రాల నుండి
డిజిటల్ లిఖితం దాకా



పుస్తకం ఒక అద్భుతం
అక్షరాలు పదాలు అనుకరణలు సర్వం పుస్తక
పఠనం పుస్తక వీక్షణ శ్రీయం
పుటలు పుటలు గా పుస్తకం
గ్రంథాల ఆలయం గా పుస్తకం
చదువులమ్మ పుట్టినిల్లు
పుస్తకం
వైవిధ్యం గా పుస్తకం
కథ నవల గద్యం పద్యం
పాట ఒక పుస్తకం
పుస్తక సమీక్షలు విశ్లేషణలు
చెయ్యడం ప్రస్తుతం కాల
ప్రాకృతం పుస్తకం ...

డి చాంద్ బాషా రచయిత

## త్యాగం - ఒక అమృత ధార



త్యాగం అనేది మానవత్వానికి మకుటం.
ఎదుటివారి సంతోషం కోసం తన స్వార్థాన్ని వదులుకోవడమే నిజమైన త్యాగం.
?స్వార్థం వీడి పరార్థం కోరే గుణమే త్యాగం,
లోక కళ్యాణం కోసం చేసే నిరంతర యజ్ఞం.

?ఎండిన భూమికి ప్రాణం పోయాలని, మేఘం తనను తాను కరిగించుకోవడం త్యాగం.
?చీకటిని తరిమి వెలుగులు పంచాలని, దీపం తన వత్తిని కాల్చుకోవడం త్యాగం.
?పరిమళం నలుగురికీ అందాలని, పువ్వు తన ఉనికిని కోల్పోవడం త్యాగం.
?బిడ్డల భవిష్యత్తు బంగారుమయం కావాలని,
తల్లిదండ్రులు తమ కోరికలను చంపుకోవడం త్యాగం.

?దేశ రక్షణ కోసం, మన కోసం సరిహద్దుల్లో, జవాను తన ప్రాణాలనే అర్పించడం త్యాగం.
మన కోసం తన రక్తం చెమటగా మార్చి శ్రమించే రైతుది త్యాగం.
?ఆకలితో ఉన్నవాడికి తన విస్తరి పెట్టి, ఆనందంగా చూసే ఆకలి చూపు త్యాగం.
?వృక్షం తాను ఎండకు ఎండుతూ కూడా, బాటసారికి నీడను ఇవ్వడం,
తన పండ్లను తాను తినకుండా మనకు ఇవ్వడం ఒక గొప్ప నిస్వార్థ త్యాగం.

నది తన నీటిని తాను తాగకుండా, మన దాహార్తిని తీర్చడం త్యాగం.
?మనిషిని మనీషిగా మార్చేది, ప్రతి హృదయంలో దైవత్వాన్ని నింపేది త్యాగం.
పరోపకారం కోసం తన వెన్నెముకనే దానం చేసిన దధీచి మహర్షిది త్యాగం.
పావురాన్ని రక్షించడానికి తన శరీర మాంసాన్ని కోసి ఇచ్చిన శిబి చక్రవర్తిది త్యాగం.

?త్యాగం అంటే ఏదో కోల్పోవడం కాదు,
ప్రేమతో మరొకరికి జీవం పోయడం.

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో,
షార్,
శ్రీహరికోట
సూళ్లూరుపేట /
తిరుపతి జిల్లా

# చట్టం చిత్రం



# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

### హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.

# రాకా మూవీలో దీపికదే కీ రోల్

### ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.




# నేను తెరిస్తే అంతే సంగతులు

### గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది. నేను వెళ్లినప్పుడే ఎవరో ఒకరు దొరుకుతారు. ఇలా చాలా మంది నాకు కనిపించారు' అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఈ విషయంపై ఆమె చేసిన మరో కామెంట్ సంచలనం సృష్టించింది.నేను చూసిన వాటి గురించి నోరు తెరిస్తే కాపురాలు కూలిపోతాయి అంటూ గీతామాధురి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.గీతామాధురి చెప్పిన ఆ జంటలు ఎవరు? వారు టాలీవుడ్‌కు చెందినవారా? లేక ఆమె వ్యక్తిగత పరిచయాల్లో ఉన్నవారా? అనే విషయంపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. అయితే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పూర్తి ఎపిసోడ్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే. ఇక గీతామాధురి కెరీర్ విషయానికి వస్తే? ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరోవైపు పాటలు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. నందు భార్యగా, ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబాన్ని చూసుకుంటూనే తన కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నారు.

# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

### భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు




బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.








# నికోలస్ పూరన్ ఎంపికకు అనుభవమే ప్రధాన కారణం

## లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నా.. నికోలస్ పూరన్‌ను ఆడించడానికి అతని అనుభవమే ప్రధాన కారణమని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో మార్పులు చేసినా నికోలస్ పూరన్‌ను పక్కన పెట్టలేమని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ బౌలింగ్ ఎంచుకుంది.పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రిషభ్ పంత్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. గతం గురించి పట్టించుకోకుండా ప్రస్తుత మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాం. ముందుగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని అనుకుంటున్నాం.లక్నోలో పిచ్ కండిషన్స్ సవాల్‌గా ఉన్నాయి. ఈ ఛాలెంజ్‌ను మేం ఇష్టపడుతున్నాం. మా సొంతగడ్డపై ఎలా ఆడాలో మేం ఒక మార్గాన్ని కనుగొంటాం. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో స్వల్ప మార్పులు చేశాం. జట్టు స్థిరత్వం



దెబ్బతినకుండా ఈ మార్పులు చేశాం. మా బౌలింగ్ విభాగంలో రెండు మార్పులు జరిగాయి.. సిద్ధార్థ్ స్థానంలో దిగ్వేష్ రతి, ఆవేష్ స్థానంలో మయాంక్ యాదవ్ జట్టులోకి వచ్చారు. నికోలస్ పూరన్‌ను తుది జట్టు నుంచి తప్పించలేం. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆటగాడిని ఎలా ఆడినా నమ్మాలి. మా జట్టుకు అతను చాలా ముఖ్యం. నికోలస్ పూరన్ పట్ల మాకున్న ప్రేమ, కేర్ అలాంటిది.'అని రిషభ్ పంత్ తెలిపాడు. మరోవైపు టాస్ ఓడిపోవాలని కోరుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. ఈ పిచ్ కండిషన్స్ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అయోమయంలో ఉన్నానని చెప్పాడు. టాస్ ఓడిపోయినందుకు సంతోషంగా ఉందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ ఎదైనా చేయడానికి తాను సిద్దమేనని తెలిపాడు. 'ఇక్కడ కొన్ని దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు ఆడాం. రెండో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదించవచ్చు.గత మ్యాచ్‌లో కోల్‌కతాపై మేము బాగానే బ్యాటింగ్ చేశాం. కానీ మిడిల్ ఓవర్లలో కొన్ని లెక్కలు తప్పాయి. అయితే జైస్వాల్, వైభవ్ బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతం. ఆ మ్యాచ్ కొన్ని తప్పులు జరిగాయి. మనం గెలవాలంటే 40 ఓవర్ల పాటు అత్యుత్తమ క్రికెట్ ఆడాలని మా ఆటగాళ్లకు చెప్పాను. ఈ రాత్రి అది చేస్తామని ఆశిస్తున్నాను. మేం అదే జట్టుతో బరిలోకి దిగుతున్నాం'అని రియాన్ పరాగ్ తెలిపాడు.

# దిల్షాన్ మదుశంక ఐపీఎల్ అరంగేట్రం



సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతూ దిల్షాన్ మదుశంక మంగళవారం (ఏప్రిల్ 21న) ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతను తన దేశం శ్రీలంకకు చెందిన పథుమ్ నిస్సంకను అవుట్ చేయడం ద్వారా తన మొదటి ×ఐపీఎల్ వికెట్‌ను సాధించాడు. మదుశంక 4 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. 2023లో భారత్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టాడు. అందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వికెట్లు కూడా ఉన్నాయి.దిల్షాన్ మదుశంకను సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా వేలంలో కొనుగోలు చేయలేదు. కానీ అతను రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చాడు. విదేశీ ఆటగాడు బ్రైడన్ కార్స్ స్థానంలో రూ. 75 లక్షల మొత్తంతో మదుశంక సన్‌రైజర్స్ లో చేరాడు. అంతకుముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కారణంగా ముంబై ఇండియన్స్ గతంలో కొనుగోలు చేసింది. 2024లో ముంబై మదుశంకను రూ. 4.60 కోట్లకు కొనుగోలు చేసింది. గాయం కారణంగా మదుశంక ఆ ఏడాది ఐపీఎల్ అరంగేట్రం చేయకుండానే తప్పుకున్నాడు. దిల్షాన్ మదుశంక ( 2000 జనవరి 18న శ్రీలంకలోని హంబన్‌తోట నగరంలో జన్మించాడు. లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అయిన మదుశంక శ్రీలంక జట్టు తరపున 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. మదుశంక 2022లో తన మొదటి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ సైతం ఆడాడు. 2023 జనవరి 10న వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం లభించింది. అతని మొదటి మ్యాచ్ టీమ్ ఇండియాతో జరిగింది. ఇందులో ఒక వికెట్ తీశాడు. అయితే ఇప్పటి వరకు మదుశంక అత్యుత్తమ స్పెల్ భారత్‌పైనే నమోదైంది. లంక పేసర్ దిల్షాన్ మదుశంక 28 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఒకసారి ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అతని ఈ స్పెల్ భారత్‌తోనే టీమిండియాపై జరిగింది. 2023 నవంబర్ 2న వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో లంక పేసర్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ తో పాటు శ్రేయస్ అయ్యర్ వంటి దిగ్గజ బ్యాటర్లను అవుట్ చేసి 5 వికెట్ల హాల్ సాధించాడు. ఈ ఐదుగురు మ్యాచ్ విన్నర్లు కావడంతో మదుశంకతో మంచి గుర్తింపు లభించింది. మదుశంక తన కెరీర్‌లో లంక తరపున 1 టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 50 వికెట్లు, టీ20ల్లో 20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ కాకుండా మదుశంక పాకిస్థాన్ సూపర్ లీగ్ ), ఇంటర్నేషనల్ లీగ్ టీ20, లంక ప్రీమియర్ లీగ్‌లలో ఆడాడు. 17 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన మదుశంక 47 వికెట్లు తీశాడు. లిస్ట్ ఏ లోని 50 మ్యాచ్‌ల్లో అతని ఖాతాలో 92 వికెట్లు ఉన్నాయి. లీగ్, అంతర్జాతీయ మ్యాచ్‌లు కలిపి అతను మొత్తం 64 టీ20 మ్యాచ్‌లాడగా 62 వికెట్లు తీశాడు. ఏప్రిల్ 21న ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచులో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతడు మొదట ప్లేయింగ్ 11లో లేడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మొదట బ్యాటింగ్ కు దిగి నిర్ణీత ఓవరల్లో 242 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలింగ్ సమయంలో ట్రావిస్ హెడ్ స్థానంలో దిల్షాన్ మదుశంకను ఇంపాక్ట్ ప్లేయర్‌గా సన్‌రైజర్స్ బరిలోకి దించింది.

# ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?

ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముంబై




ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్.ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.

.........

# ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలి

టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్ పాట్ కమిన్స్ వచ్చినా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్‌కు టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సంజయ్ బంగర్ సూచించారు. ఇషాన్ సారథ్యంలో జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని, ఆ మూమెంటమ్‌ను దెబ్బతీయవద్దని కోరారు. వెన్ను గాయంతో పాట్ కమిన్స్ ఐపీఎల్ ఫస్టాఫ్ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న కమిన్స్.. జట్టుతో కలిసాడు. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్ వేదికగా జరిగే తమ తదుపరి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. కమిన్స్ రాకతో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ మార్పు జరుగుతుందా? లేదా? అనే సస్పెన్స్ నెలకొంది. ఈ వ్యవహారంపై జియో హాట్‌స్టార్ షోలో హార్భజన్ సింగ్, టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ మాట్లాడారు. ఈ ఇద్దరూ ఇషన్ కిషన్‌నే సారథిగా కొనసాగించాలని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు సూచించారు. 'పాట్ కమిన్స్ తిరిగి వచ్చినా సరే.. ఇషాన్ కిషనే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కొనసాగించాలి. ఈ నిర్ణయం చర్చనీయాంశం కావచ్చు. కానీ జట్టు ఒక యువ నాయకుడికి మద్దతు ఇచ్చినప్పుడు.. అతనితోనే ముందుకు సాగాలి.బౌలర్లు, ఇతర ఆటగాళ్లు ఇషాన్ కిషన్‌తో మంచి సమన్వయాన్ని పెంచుకున్నాడు. ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా కొనసాగించడం వల్ల సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రయోజనం చేకూరుతుంది.'అని హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు.కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడని, కమిన్స్ రాకతో అతన్ని పక్కనపెడితే టీమ్ మూమెంటమ్ దెబ్బతింటుందని సంజయ్ బంగర్



హెచ్చరించాడు. 'సారథిగా ఇషాన్ కిషన్ తన బౌలర్లను సమర్థవంతంగా ఉపయోగించకుంటున్నాడు. ఏ బ్యాటర్ మీద ఏ బౌలర్‌ను ఉపయోగించాలనే విషయంలో అతనికి స్పష్టమైన అవగాహన ఉంది. ఇది అతను ఆటను ఎంత బాగా నియంత్రిస్తున్నాడో చెప్పడానికి ఒక నిదర్శనం.తీవ్ర ఒత్తిడిలో కూడా ఇషాన్ కిషన్ ఎలాంటి గందరగోళానికి గురికాకుండా.. తొందరపడకుండా మైదానంలో సరైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్లను ఉపయోగించిన తీరు అద్భుతం. పాట్ కమిన్స్ ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకున్నాడు. అతను ఏ మేరకు రాణిస్తాడో చెప్పలేం. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ కూడా ఇషాన్ కిషన్‌నే కొనసాగించాలనే యోచనలో ఉండవచ్చు.'అని సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. మెజార్టీ అభిమానులు కూడా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని కోరుకుంటున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు మీద ఉంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# యువ పేసర్‌కు హగ్ ఇచ్చిన కావ్య మారన్?



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్, ఆ జట్టు యువ పేసర్ ప్రఫుల్ హింగేకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రఫుల్ హింగేను కావ్య మారన్ హగ్ చేసుకున్నట్లుగా ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమైంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన ప్రఫుల్ హింగే.. 4 వికెట్లతో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో తన రెండో మ్యాచ్‌లో వికెట్ తీయకపోయినా.. ఆఖరి ఓవర్‌లో కట్టడిగా బౌలింగ్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గత మ్యాచ్‌కు ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే ఈ యువ పేసర్ ప్రదర్శనకు ఫిదా అయిన కావ్య మారన్.. ఈ కుర్రాడిని హగ్ చేసుకున్నట్లు కొందరు ఆకతాయిలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఫేక్ వీడియోను సృష్టించారు. ఈ వీడియోలో ప్రఫుల్ హింగేతో పాటు మరో యువ పేసర్ సాకిబ్ హుస్సేన్‌ను కావ్య మారన్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఉంది. అయితే ఈ వీడియోను చూస్తేనే ఇది ఏఐతో తయారు చేసిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అయితే ఇది తెలియని కొందరు అభిమానులు నిజమేనని భావించి.. వైరల్ చేస్తున్నారు. 'కుర్రాళ్ల ప్రతిభకు ఫిదా అయిన కావ్య మారన్ వారిని హగ్ చేసుకొని ప్రశంసించింది. ఆమె హగ్‌తో కుర్రాళ్లు సంతోషానికి గురయ్యారు.'అనే క్యాప్షన్స్ రాసుకొస్తున్నారు. అయితే ఈ వీడియోలో ఎలాంటి నిజం లేదు.కావ్య మారన్ ఎప్పుడూ మైదానంలోకి రారు. ఆటగాళ్లతో కూడా చాలా తక్కువగా మాట్లాడుతారు. ఐపీఎల్ 2024 ఫైనల్ ఓటమి అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి కావ్య మారన్ తొలిసారి వచ్చారు. ఓటమి బాధలో ఉన్న ఆటగాళ్లను ఓదార్చారు. అంతే తప్పా ఎప్పుడూ ఆమె మైదానంలో అడుగుపెట్టలేదు. గ్యాలరీలోనే సందడి చేసి అక్కడి నుంచే వెళ్లిపోతారు. కావ్యమారన్‌పై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించడం ఇదే తొలిసారి కాదు. గతంలో జై షా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో సన్నిహితంగా ఉన్నట్లు ఫేక్ వీడియోలను సృష్టించి వైరల్ చేశారు.

# సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న రబాడ వీడియో

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ, మైదానంలో ఆటగాళ్ల మెరుపుల కంటే బయట వారు చేస్తున్న పనులు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ క్రికెటర్లు బహిరంగంగా సిగరెట్లు తాగుతూ దొరికిపోవడం క్రీడా వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇటీవల స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సిగరెట్ తాగుతూ కనిపించగా, ఇప్పుడు సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కాగిసో రబాడ వంతు వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడ, ఒక చోట కూర్చుని దర్జాగా సిగరెట్ తాగుతున్న వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో ఎక్కడిది అనే దానిపై క్లారిటీ లేనప్పటికీ, ఇది ఏదో ఒక హోటల్ లేదా స్టేడియంలోని ప్లేయర్స్ ఏరియాలో తీసినట్లు కనిపిస్తోంది. ఫిట్‌నెస్ మీద అత్యంత శ్రద్ధ చూపే అథ్లెట్లు ఇలా బహిరంగంగా ధూమపానం చేయడం పట్ల నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొద్దిరోజుల క్రితమే పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా ఇలాంటి వివాదంలోనే చిక్కుకున్నాడు. తన లగ్జరీ బీఎండబ్ల్యూ కారును నడుపుతూ, కారు కిటికీలో నుంచి వెలుగుతున్న సిగరెట్‌ను బయటకు విసిరేస్తూ చాహల్ కెమెరాకు దొరికిపోయాడు. ఆ వీడియోను ఒక అభిమాని షూట్ చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో చాహల్ మీద విమర్శల వర్షం కురిసింది. ఇప్పుడు రబాడ కూడా అదే బాటలో నడవడంతో క్రికెట్ ప్రేమికులు పెదవి విరుస్తున్నారు.వివాదాలు పక్కన పెడితే, మైదానంలో మాత్రం రబాడ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో అతను 10 వికెట్లు పడగొట్టాడు. పర్పుల్ క్యాప్ రేసులో కూడా ముందు వరుసలో ఉన్నాడు. అయితే ఇటువంటి వీడియోలు బయటకు రావడం వల్ల అతడి ఇమేజ్‌తో పాటు జట్టు పేరు కూడా దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోపై మిశ్రమ స్పందన వస్తోంది. క్రికెటర్లు యువతకు రోల్ మోడల్స్ గా ఉండాలి.. ఇలాంటి పనులు చేయడం తప్పు అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, "అది వారి వ్యక్తిగత విషయం, ఆట మీద దాని ప్రభావం లేనంత వరకు పర్వాలేదు" అని మరికొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఏది ఏమైనా, బీసీసీఐ, ఐపీఎల్ యాజమాన్యం ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉండాలని మెజారిటీ అభిమానులు కోరుకుంటున్నారు.



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999